ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, తదితరులు

- సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ

మెట్‌పల్లి, జనవరి 23: ప్రజలకు సమస్యలుంటే నేరుగా తనను సంప్రదిస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంతో పాటు మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన 76 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.23.47లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి దవాఖానల్లో చికిత్స పొందిన వారు ఆర్థిక సాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సమస్యలుంటే నేరుగా తనన కలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు

వెల్గటూర్: రాంనూర్‌లో పశువును పరీక్షిస్తున్న పశు వైద్యాధికారి శ్రీప్రియ

వెల్గటూర్, జనవరి 23: వెల్గటూర్ మండలం రాంనూర్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు, బర్రెలకు వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు శ్రీప్రియ, మనోజ్‌కుమార్, సిబ్బంది రాజేందర్, రామ్‌కుమార్, నారాయణ, లక్ష్మి, చంద్రయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

మల్లాపూర్, జనవరి 23: ముత్యంపేటలో పశుసంవర్ధక శాఖ, కోరుట్ల పశు వైద్య కళాశాల సంయుక్తంగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ బక్కయ్య, కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్, పశు వైద్యాధికారులు అశోక్, గంగప్రసాద్, శ్రీనివాస్, మనీషా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సురేశ్, ప్రియాంక, సిబ్బంది ఇక్బాల్, రవీందర్, వినోద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

గొల్లపల్లి: కనకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి/గొల్లపల్లి/వెల్గటూర్, జనవరి 23: గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన కట్ట రాజేశ్వర్ రావు, కనకయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. అలాగే, గోవింద్‌పల్లికి చెందిన కాల్వ పెద్ద రాజయ్య, ఎండపల్లి మండలం చెర్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బట్టు రామస్వామి తండ్రి మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వెళ్లి పరామర్శించారు. అలాగే, బుగ్గారం మండల పాత్రికేయుడు సుధన్ తాతయ్య రాజలింగు, బుగ్గారం గ్రామానికి చెందిన బుదారపు లక్ష్మి, చిన్నాపూర్‌కు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ తల్లి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త చింతపండు పోచయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షులు జలంధర్, సింహాచలం జగన్, గాలిపెల్లి మహేశ్, చెందోలి పీఏసీఎస్ చైర్మన్ వెంకట మాధవరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, హన్మాండ్లు, వైస్ చైర్మన్ లింగా రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రవీందర్, మాజీ ఉపసర్పంచ్ మారం రాజశేఖర్, నాయకులు గాజుల మల్లేశం, పడిదం మొగిళి, వెంకటేశ్, నారాయణ, రవి, శ్రావణ్, సొల్లు రాజేశం, తిరుపతి, సత్తయ్య, మహేశ్, రాజేందర్, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, అబ్దుల్ రహమాన్, రాజు, ప్రవీణ్, సత్తయ్య తదితరులున్నారు.

బైండోవర్ నిబంధన ఉల్లంఘించిన వ్యక్తికి జైలు

రాయికల్, జనవరి 23: మండలంలోని ఉప్పుమడుగు గ్రామానికి చెందిన అల్లెపు వెంకటనర్సయ్య బైండోవర్ నిబంధన ఉల్లంఘించడంతో తహసీల్దార్ ఖయ్యూం 161 రోజుల జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటనర్సయ్య గతంలో నాటుసారా విక్రయించగా ఎక్సైజ్ అధికారులు పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. తిరిగి నాటుసారా విక్రయిస్తూ దొరకగా రూ. లక్ష జరిమానా విధించారు. అయితే, సకాలంలో జరిమానా చెల్లించలేకపోవడంతో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ రావు గురువారం వెంకటనర్సయ్య రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం ఎదుట హాజరుపరుచగా జైలు శిక్ష విధించారు. డీటీఎఫ్ సీఐ రాజమౌళి, ఎస్ఐలు స్వప్న, సుధీర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపూర్‌లో చిరుత పులి కలకలం

కొడిమ్యాల, జనవరి 23: కొండాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తునట్లు గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన గుండు బాబు అనే రైతు బుధవారం తన పొలం వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూసేసరికి తన వ్యవసాయ భూమికి కొంత దూరంలో ఆవు మృతి చెంది ఉంది. ఆవు కళేభరంపై పెద్ద పెద్ద గాట్లు ఉండడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయమై అటవీ శాఖ రేంజర్ మొహినొద్దీన్‌ను వివరణ కోరగా చిరుత దాడి చేసినట్లు ఉందని, నిర్ధారించడానికి అడవిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో క్లారిటి ఇస్తామని చెప్పారు.